ఫ్యాన్‌కు ఓటు..ప్రగతికి చోటు

- ఎన్నికల ప్రచారంలో కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేస్తే.. అభివృద్ధికి వేసినట్లు అని ఆ పార్టీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని 12 వ వార్డు వడ్డగేరి, మేధారి వీధి 48వ వార్డు రోజా వీధిలో ఆయన కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి తో కలిసి గడప గడపకు ఇంతియాజ్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. కాలనీలలో చిరు వ్యాపారులతో మాట్లాడారు. కరపత్రాలు పంపిణీ చేశారు. జగనన్న పథకాలు అందాయా అని వివిధ వర్గాల ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతూ పేద వర్గాలకు జగనన్న పాలనలోనే న్యాయం జరుగుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ ధనవంతులను మాత్రమే పట్టించుకుంటుందన్నారు. గతంలో ఇప్పటిలాగా ఇంటింటి సంక్షేమం లేదన్నారు. పేదలను ఆదుకోవాలన్న ఆలోచన చంద్రబాబుకు లేదన్నారు. 2019 నుంచి ఐదేళ్ల పాటు పేద ప్రజల అభివృద్ధికి కృషి చేసిన జగనన్నను వచ్చే ఎన్నికల్లో గెలిపించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ గెలుపుతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. తనను ఎమ్మెల్యేగా ఎన్నుకుంటే పారిశ్రామికంగా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి ఉపాధి అవకాశాలు పెంపొందిస్తానన్నారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలుకు మంచి అభ్యర్థి, విద్యావంతుడు మాజీ కలెక్టర్ అయిన ఇంతియాజ్‌ను అభ్యర్థిగా నిలబెట్టారన్నారు. ఆయనను గెలిపించుకుంటే మన కర్నూలు నగర రూపురేఖలు మారుతాయన్నారు. పరిపాలన లో సుదీర్ఘ అనుభవం ఉన్నందున సమస్యల పరి ష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సీహెచ్ మద్ద య్య, కార్పొరేటర్లు క్రాంతికుమార్, మల్లికాబేగం. రాజేధర్ ఖాన్, నవీన్, సత్యరాజు, మన్నేష్, లలిత్ వాహిద్, నాగవేణీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మహిళకు ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ

ఓర్వలేక జగన్‌పై దాడి

కర్నూలు (న్యూటౌన్): విజయవాడలో మేమంతా సిద్ధం బస్సుయాత్ర చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ నేతలు రాళ్లదాడి చేయడాన్ని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. వైఎస్ జగన్‌కు ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఆదరణ లభిస్తుందన్నారు. దీనిని చూసి ఓర్వలేక టీడీపీ నేతలు ఆయనపై దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మద్దిలేటయ్య ఆదాయం రూ.9.21 లక్షలు

బేతంచెర్ల: ఆర్ఎస్ రంగాపురం శివార్లలో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామికి చైత్ర మాసం శనివారం పురస్కరించుకొని భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు వివిధ సేవలు నిర్వహించుకోవడంతో రూ.9,21,024 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ రామాంజనేయులు, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు.

క్లుప్తంగా

20న వ్యాస రచన పోటీలు

కర్నూలు కల్చరల్: అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 117ఎస్, అలియన్స్ క్లబ్ ఆఫ్ గ్రేటర్ కర్నూలు, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 20వ తేదీ ఉదయం 9 గంటలకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇంటర్నేషనల్ కౌన్సిల్ చైర్‌పర్సన్, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్' అనే అంశంపై 4 – 10 సంవత్సరాల లోపు చిన్నారులు సబ్ జూనియర్స్ గాను, 11 నుంచి 15 సంవత్సరాల లోపు వారిని జూనియర్స్ గాను, 15 సంవత్సరాలకు పైబడిన వారిని సీనియర్స్ గాను పరిగణిస్తామని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతితో పాటు కన్సొలేషన్, నగదు బహుమతులు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 16వ తేదీలోగా వెంకటరమణ కాలనీ మొదటి లైన్‌లో ఉన్న నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9396861308 నంబర్‌ను సంప్రదించవచ్చని విజ్ఞప్తి చేశారు.

పన్ను రాయితీకి విశేష స్పందన


నగర పాలకలో పన్నులు చెల్లించేందుకు క్యూ కట్టిన పన్నుదారులు

కర్నూలు (టౌన్): 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను, నీటి పన్నును ఏక మొత్తంలో ముందుగానే చెల్లించే పన్నుదారులకు ప్రభుత్వం 5 శాతం రాయితీ ఇస్తోంది. ఈ సదుపాయాన్ని నగరంలో చాలా మంది వినియోగించుకుంటున్నారు. రెండో శనివారం సెలవు రోజు అయినా అడ్వాన్స్ పన్ను చెల్లించేందుకు కౌంటర్ల వద్ద పన్నుదారులు క్యూ కట్టారు. దీంతో ఒక్కరోజు ఆస్తి పన్ను రూ. 25.54 లక్షలు, నీటి పన్ను రూ.2.87 లక్షలు కలిపి మొత్తం రూ. 28.41 లక్షలు వసూలైనట్లు నగరపాలక రెవెన్యూ అధికారి జునీద్, మేనేజర్ చిన్నరాముడు వెల్లడించారు. ఆదివారం కూడా కౌంటర్లు పనిచేస్తాయని వెల్లడించారు.

స్విమ్మింగ్‌లో ఉచిత శిక్షణ

కర్నూలు (టౌన్) : నందికొట్కూరు రోడ్డులోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో ఉన్న సహస్త ఇన్‌ఫ్రా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్విమింగ్ పూల్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ఆ సంస్థ ప్రొప్రయిటర్ శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచి ఆహ్లాదకర వాతావరణంలో చిన్నారులు, పెద్దలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

మేటి క్రీడాకారులుగా రాణించాలి


జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్): అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని మేటి క్రీడాకారులుగా రాణించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి లేజర్ రన్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జెండా ఊపి ప్రారంభించిన డీఎస్‌డీఓ మాట్లాడుతూ గత ఏడాది గోవాలో నిర్వహించిన జాతీయ క్రీడల్లో కర్నూలు జిల్లాకు చెందిన క్రీడాకారుడు వెంకటేష్ పతకం సాధించారన్నారు. జాతీయ యోగా సంఘం సంయుక్త కార్యదర్శి న్యాయవాది శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 21 వరకు నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించనున్న 8 వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి అవినాష్ పాల్గొన్నారు.

సేవా ధర్మ స్వరూపం.. రామకథాభావం


ప్రవచనం చెబుతున్న డాక్టర్ బోలుగద్దె అనిల్‌కుమార్

కర్నూలు కల్చరల్: రామ కథా భావం సేవా ధర్మ స్వరూపమని, శ్రీరాముడు సేవా స్వరూపుడని ప్రవచన కర్త డాక్టర్ బోలుగద్దె అనిల్‌కుమార్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల ఆలయంలో ఏర్పాటు చేసిన శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు శనివారం 'శ్రీమద్రామాయణం – సేవా ధర్మ' అనే అంశంపై ఉపన్యసించారు. స్వలాభం ఆశించకుండా సేవ చేయడం పరమార్థమన్నారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, కార్పొరేటర్ నగరూరి శ్రీనివాసులు, అర్చకులు గిరిశర్మ, కృష్ణకాంత్, సంజీవనాథ్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే మరింత సంక్షేమం

- టీడీపీ నాయకుల మాటలు నమ్మొద్దు
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


పర్లలో ప్రచారం నిర్వహిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే మరింత సంక్షేమం సాధ్యమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పర్ల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ఆప్యాయంగా పలకరిస్తూ ఐదేళ్లలో చేసిన మంచిని వివరిస్తూ మరోసారి తనను గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తెచ్చుకోవాలని సూచించారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని కోరారు. రోజుకో మాట మాట్లాడే జనసేన, బీజేపీ, టీడీపీ నాయకుల మాటలు నమ్మొద్దని వారికి ఓటేస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని వివరించారు. ఈ ఐదేళ్ల కాలంలో పర్ల గ్రామంలో రూ.2.80 కోట్ల అభివృద్ధి పనులు చేశామని, వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రజలు మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లకుండా సేవలు అందించామని గుర్తు చేశారు. మనబడి నాడు–నేడు పథకం కింద పాఠశాలల రూపురేఖలు మార్చామన్నారు. తమ ప్రభుత్వంలో మంచి జరిగిందనిపిస్తే ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అశోక్ వర్ధన్‌రెడ్డి, పార్టీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జ్ గాజుల శ్వేతారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకన్న, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఈశ్వరయ్య, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, కల్లూరు సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, పి.శేఖర్, పి.హరి, భార్గవ్, మహేష్, వెంకటేశ్వర్లు, ఖాజా హుస్సేన్, దస్తగిరి, యేసు, ఎల్లప్ప, హనుమంతురెడ్డి, తిరుపాల్, కార్పొరేటర్లు నారాయణరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు.

ఓర్వకల్లు మండలంలో ఉమామహేశ్వరమ్మ ప్రచారం


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: మండలంలోని కన్నమడకల, ఓర్వకల్లు గ్రామాల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సతీమణి ఉమామహేశ్వరమ్మ శనివారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా రాంభూపాల్‌రెడ్డిని, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని ఆమె కోరారు. ముందుగా కన్నమడకల గ్రామంలోని కొత్త బిల్డింగులు, వడ్డెగేరి, బోయ పేట, ఎస్సీ కాలనీ, పరంపేటలో పర్యటించి 300 కుటుంబాలను కలిసి ఓటేయాలని కోరారు. సాయంత్రం వరకు ఓర్వకల్లులో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కొండపేట, కాపగేరి, మెయిన్ బజార్, ఎస్సీ కాలనీ, కురువ గేరి, తోటగేరి ప్రాంతాలలోని 200 కుటుంబాలను కలుసుకుని ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, ఆయా గ్రామాల సర్పంచులు పెద్ద కాశిమన్న, నాగేశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యులు సోమశేఖర్‌రెడ్డి, నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, రాజేంద్రారెడ్డి, తిక్కలి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు చెట్ల కళావతమ్మ, శంకరెడ్డి, మీనిగ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచు పెద్దయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, నాగలింగేశ్వరరెడ్డి, మైనార్టీ నాయకులు చాంద్‌బాషా, బషీర్ మియా, రాజమోహన్‌రెడ్డి, పాల సుబ్బారెడ్డి, దళిత నాయకులు క్రిష్ణ, చేట్ల సంజన్న, కృపయ్య, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

కల్లూరు అర్బన్ 34వ వార్డులోని 10 టీడీపీ కుటుంబాలు శనివారం కార్పొరేటర్ ఎరుకల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. సుంకన్న, సుధాకర్, భవానీ, దుర్గ, మారెమ్మ, జమక్క తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

ప్రభుత్వ కాలేజీల్లో మెరుగైన ఫలితాలు


ఉత్తమ మార్కులు సాధించిన వారితో డీవీఈఓ జమీర్ పాషా, తదితరులు

కర్నూలు సిటీ: ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించినట్లు జిల్లా వృత్తి విద్యాధికారి కె.జమీర్ పాషా తెలిపారు. శనివారం స్థానిక బీ క్యాంపులోని ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెరిగిందన్నారు. ముందస్తు ప్రణాళికతో ఫలితాలు మెరుగయ్యాయన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ మాట్లాడుతూ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 209 మంది హాజరుకాగా, 123 మంది, సెకండ్ ఇయర్ పరీక్షలకు 145 మందికిగాను, 104 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. సెకండ్ ఇయర్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ విభాగంలో జి.త్రిష 945/1000, సీజీటీలో సమీన 941, సీఎస్‌ఈలో మహేష్ బాబు 940, ఓఏ గ్రూప్‌లో లిఖిత రెడ్డి 913, ఎంఎల్‌టీలో ఇర్ఫాన్ 856, ఈఈటీలో జావీద్ 767, ఏఅండ్‌టీ విభాగంలో అబ్దుల్ రెహమాన్ 748 మార్కులు సాధించారన్నారు. ఫస్ట్ ఇయర్‌లో సీఎస్‌ఈలో కేదరనాథ్ రెడ్డి 477/500, సీజీటీలో రోజా 471, ఏటీలో అభిషేక్ బాబు 471, ఎంపీహెచ్‌డబ్ల్యూలో జయలక్ష్మి 469, ఎంఎల్‌టీ అన్సర్ 464 మార్కులు సాధించారన్నారు.

ఇంటర్‌లో సత్తా చాటిన కేజీబీవీ విద్యార్థినులు


యు.మానస | టి.సుజాత | ఎస్.సన | ఆర్.కుమారి | బి.రుబాన్సీ | కె.ద్రాక్షాయణి

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో మండల పరిధిలోని పంచలింగాల గ్రామం దగ్గర ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైనట్లు స్పెషల్ ఆఫీసర్(ప్రిన్సిపాల్) స్వప్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అకౌంటెన్సీ అండ్ టాక్సేషన్ గ్రూప్‌లో 24 మందికి గానూ 24 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. టి.మానస 495/500, యు.మానస 495/500, ఎస్.సన 491/500, టి.సుజాత 491/500, ఆర్.కుమారి 483/500 మార్కులు సాధించారన్నారు. సెకండ్ ఇయర్‌లో 18 మందికి 16 మంది ఉత్తీర్ణులయ్యారని, ఇందులో 1,000 మార్కులకు గానూ బి.రుబాన్సీ 951, కె.ద్రాక్షాయణి 950, బి.ఉమా 945 మార్కులు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను, ఫ్యాకల్టీ, ప్రిన్సిపాల్‌ను సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ సీహెచ్ విజయజ్యోతికుమారి, జీసీడీఓ సునీత అభినందించారు.

అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని

ఇంటర్ ఫలితాల్లో ఆస్పరి కేజీబీవీ విద్యార్థి నిర్మల సత్తాచాటారు. ఆదోని మండలం పెద్దహరివాణంకు చెందిన శీనప్ప, హనుమంతమ్మ దంపతులకు నలుగురు ఆడ పిల్లలు. వారిలో ముగ్గిరికి వివాహాలు చేశారు. చివరి కుమార్తె ఎస్.నిర్మల జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో చదివి పదోతరగతిలో (2021–22 విద్యా సంవత్సరం) 537 మార్కులు సాధించారు. ఆపై చదువులకు కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో కూలీ పనుల కెళ్లేది. అయితే, ఈ బాలికకు చదువుపై ఉన్న ఆసక్తిని తెలుసుకుని ఆస్పరి కేజీబీవీలో చేర్పించగా ఇంటర్ మొదటి సంవత్సరంలో 440 మార్కులకు 421 మార్కులు సాధించినట్లు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. ఈ విద్యార్థిని పై చదువులకు తాము పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

వందేళ్ల రాజకీయ చరిత్ర మాది


పాస్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

- ప్రజలను ఓటు అడిగే హక్కు కోట్లకు లేదు
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: 'మా కుటుంబానికి వందేళ్ల రాజకీయ చరిత్ర ఉంది. బేతంచెర్ల మండలంలో మా తాతల, తండ్రుల కాలం నుంచి పాఠశాల, గ్రంథాలయం లాంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టి శాశ్వత భవనాలను నిర్మించాం. మరో వందేళ్లు గుర్తుండిపోయేలా ప్రజా సేవా చేశాం' అంటూ మంత్రి బుగ్గన అన్నారు. స్థానిక గుత్తి రోడ్డులోని సమైక్య క్రైస్తవ కమ్యూనిటీ హాల్‌లో శనివారం జరిగిన చర్చి పాస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓటమి భయంతోనే టీడీపీ అభ్యర్థి కోట్ల తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. 50 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న ఆయన డోన్‌కు ఏమి చేశారో ప్రజలకు చెప్పడమే కాక భవిష్యత్తులో ఏమి చేస్తారో చెప్పాలని హితవు పలికారు. రెచ్చగొట్టేలా మాట్లాడటం కోట్ల అవివేకానికి నిదర్శనమన్నారు. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో తిరిగి ముఠాకక్షల కుంపటిని రాజేసుందుకు ప్రయత్నిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గంలో జరిగిన ప్రతి అభివృద్ధి పనిలో తానున్న విషయాన్ని గర్వంగా చెప్పగలుగుతామన్నారు. మరో రెండు నెలల్లో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ప్రతి ఇంటికి శుద్ధజలం అందుతుందన్నారు. మత సామరస్యానికి విఘాతం కలిగించే పార్టీలతో పొత్తు పెట్టుకున్న టీడీపీని ప్రజలు దూరం పెడతారన్నారు. కేంద్ర మంత్రిగా పని చేసిన నాయకుడు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ప్రార్థనా మందిరాల్లో ఎన్నికల ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

బాబు హామీలకు గ్యారెంటీ లేదు..

బాబు షూరిటీ .. భవిష్యత్తుకు గ్యారెంటీ అంటూ ప్రజలను మభ్యపెడుతున్న చంద్రబాబును ప్రజలు నమ్మరని మంత్రి బుగ్గన విమర్శించారు. డోన్‌లో బుల్లెట్ లాంటి వ్యక్తిని తనపై పోటీకి నిలబెట్టుతానని బాబు ఓ టీడీపీ నాయకుడిని నట్టేట ముంచిన విషయాన్ని స్థానికులు ఇంకా మరిచిపోలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరి భవిష్యత్తుకు షూరిటీ ఇస్తారో బాబుకే తెలియదని విమర్శించారు. కార్యక్రమంలో రాయలసీమ క్రైస్తవ సంఘం అధ్యక్షులు బందెల రాజు, క్రైస్తవ సంఘం నాయకులు నిత్యానందం, భాస్కర్, రాజశేఖర్, ఆదాం, సాల్మోన్, జాకబ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం దాత సహకారంతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లా పెద్ద టేకూర్ గ్రామానికి చెందిన కురువ పాల చిన్న మద్దిలేటి, లక్ష్మీదేవమ్మ కుటుంబ సభ్యులు మధు, శారద, మహేష్, రాజేశ్వరి, లోకేష్, చంద్రిక రూ.7 లక్షల విలువ చేసే మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశారు. శనివారం నూతన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆలయ ఈఓ రామాంజనేయులు చేతుల మీదుగా ప్రారంభించి ఆలయానికి అప్పగించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ ఈఓ రామాంజనేయులు అభినందించారు.

23 వాహనాలు సీజ్

కర్నూలు : నగర శివారులోని సుంకేసుల రోడ్డులో సంజీవని హాస్పిటల్ దగ్గర ట్రాఫిక్ సీఐ గౌతమి ఆధ్వర్యంలో శనివారం రాత్రి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి 23 వాహనాలను సీజ్ చేశారు. పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఉన్న దుకాణంలో మద్యం తాగి వాహనాలపై వస్తుండగా ట్రాఫిక్ పోలీసులు మద్యం పరీక్షలు నిర్వహించి 20 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, ఒక బొలెరో వాహనం సీజ్ చేశారు. వాటిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన మద్యం బాబులను సోమవారం కోర్టులో హాజరుపర్చనున్నట్లు సీఐ తెలిపారు.

ఫోక్సో కేసు నమోదు...

కర్నూలులోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన మైనర్ బాలికపై మైనర్ బాలుడు అత్యాచారం చేశాడు. ఈ మేరకు బాలిక మేనత్త ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేసి ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు


స్వాధీనం చేసుకున్న బైక్, కర్ణాటక మద్యాన్ని చూపుతున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని సి.బెళగల్ మండలం సంగాల గ్రామంలో శనివారం తమ సిబ్బందితో దాడులు నిర్వహించి ద్విచక్రవాహనంపై 7 బాక్స్‌ల్లో తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. నిందితుడు సంగాల బోయ రంగన్న మద్యాన్ని వదిలేసి పారిపోగా, ద్విచక్రవాహనాన్ని, రూ.42 వేల విలువ చేసే మద్యాన్ని సీజ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. వెల్దుర్తి మండలంలోని రత్నపల్లె గ్రామానికి చెందిన ఈడిగ వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని 10లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని నిందితుడిని డోన్ కోర్టులో హాజరు పర్చగా, జడ్జి రిమాండ్‌కు ఆదేశించారని సీఐ వివరించారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది హనుమంతు, శంకర్‌నాయక్, వెంకటేష్ నాయక్, అఫ్రోజ్ బాషా పాల్గొన్నారు.

సుంకేసుల చెక్‌పోస్టు వద్ద

ఏపీ–తెలంగాణ సరిహద్దు సుంకేసుల చెక్‌పోస్టు వద్ద శనివారం పోలీసులు తెలంగాణ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సీఐ మన్సూరుద్దీర్ విలేకరులకు వెల్లడించారు. పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కొత్తకోటకు చెందిన తిప్పన్న, రాఘవేంద్ర ద్విచక్రవాహనంపై 144 తెలంగాణ మద్యం బాటిళ్లతో పట్టుబడ్డారన్నారు. అలాగే మండలంలోని గోరంట్ల గ్రామంలో ఎస్ఐ బాలనరసింహులు తన సిబ్బందితో దాడులు నిర్వహించి ఈశ్వరయ్యను అరెస్ట్ అతని వద్ద నుంచి 40 చీప్ లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారన్నారు. రెండు ఘటనలకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ యూపీ రూ.25 వేల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. సమావేశంలో సెబ్ సీఐ మల్లిక, కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ ఎస్ఐలు బాలనరసింహులు, హనుమంతు, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల జీవితాల్లో వెలుగులు

- కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని, ప్రజల ఇంటి ముంగిటకే పథకాలందించిన జగనన్నను ప్రజలంతా మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కోడుమూరు అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ కోరారు. శనివారం మండలంలోని గోరంట్ల, కొత్తపల్లె గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు చేస్తున్న మేలును తట్టుకోలేక టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు చేస్తూ ప్రజలను ఇబ్బందులపాలు చేస్తున్నారని, ఇందుకు నిదర్శనం సజావుగా జరిగే పింఛన్ల పంపిణీని అడ్డుకుని అవ్వతాతలను, వికలాంగులను తీవ్ర కష్టాలకు గురిచేయడమేనన్నారు. అపద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్న చంద్రబాబుకు మరోసారి బుద్ధి చెప్పాలని వారు ప్రజలను కోరారు. వైఎస్సార్ సీపీ తరఫు కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై.రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్‌లను భారీ మెజార్టీతో గెలిపించుకుని జగనన్నకు కానుకగా ఇద్దామని వారు ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ గాడిరూతమ్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రవి, మస్తాన్, నాయకులు పరశురాముడు, కైలాస్, మాధవ నాయుడు, నడిపి మాదన్న, గోపాల్, మధు, అయ్యన్న, శివప్రసాద్, మల్లారెడ్డి, రవికుమార్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రతిభ కనబర్చిన టౌన్‌మోడల్ విద్యార్థులు


అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో టౌన్‌మోడల్ కాలేజీ ప్రిన్సిపాల్ సుంకన్న

కర్నూలు సిటీ: ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థులు ఇంటర్‌లో మెరుగైన మార్కులు సాధించినట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ సుంకన్న తెలిపారు. కాలేజీలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మొదటి సంవత్సరంలో 40 శాతం, సెకండ్ ఇయర్‌లో 60 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. ఒకేషన్ విభాగంలో 100 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. సెకండ్ ఇయర్ ఎంపీసీలో ఎం.వైష్ణవి 961 మార్కులు, కె.జావీద్ 961 మార్కులతో కాలేజీ టాపర్లుగా, అబ్దుల్ మోహి 959 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. బైపీసీ విభాగంలో హరీష్ గౌడ్ 960 మార్కులు, వెంకట లక్ష్మి 944, సీఈసీలో గాయత్రి 951, వినయ్‌కుమార్ 950 మార్కులు, హెచ్‌ఈసీలో సందేశ్‌కుమార్ 950 మార్కులు, అయేషా 938 మార్కులు, మొదటి సంవత్సరం ఎంపీసీలో పావని 458, లలిత రాణి 454, ఆర్.వైష్ణవి 433, బైపీసీలో రేణు విజయ్ 429, నందిని 406 మార్కులు సాధించారన్నారు.